సాక్షి కర్నూలు
శుక్రవారం । 27 । జూన్ । 2025



### అవ్వకు 'వంద'నం

ఎలాంటి రోగాలు లేకుండా వందేళ్లకు పైగా అవ్వ హనుమంతమ్మ ఆరోగ్యంగా ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం అవ్వకు సన్మానం చేశారు. 8లో▶



### మొహర్రం ప్రారంభం

ఆకాశంలో గురువారం సాయంత్రం నెలవంక కనిపించడంతో మొహర్రం ప్రారంభమైంది. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం జ్ఞాపకార్థం సంతాప కార్యక్రమాలు చేస్తారు. 8లో▶



### టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,618.32 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 55.128 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 35,080 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 198 |

## న్యూస్‌రీల్

### శ్రీమఠంలో భక్తుల రద్దీ



శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి గురువారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో మంత్రాలయ క్షేత్రం కళకళలాడింది. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, తర్వాత రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకున్నారు. సుమారు రెండున్నర గంటల సమయం పట్టింది. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లతో భక్తుల రద్దీ కనిపించింది.

### పాఠశాలకు వచ్చి.. విద్యార్థులతో మాట్లాడి

- కె.సింగవరంలో తెలంగాణ విజిలెన్స్ డీజీ



స్కూల్లో ప్రార్థనకు హాజరైన తెలంగాణ విజిలెన్స్ డీజీ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తన స్వగ్రామమైన కె.సింగవరానికి గురువారం వచ్చారు. గ్రామంలోని యూపీ స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడంతో అక్కడికి చేరుకుని విద్యార్థులతో గడిపారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం రాధ, సర్పంచ్ రవీంద్రరెడ్డి, ఎంఈఓ ఆదామ్‌బాషా, స్కూల్ టీచర్లు, విద్యార్థులతో కలసి ఆయన పాఠశాల ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ డీజీని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద నాగేశ్వరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మన్న, క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ శాఖ ఏడీఏల బదిలీలు కొలిక్కి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో ఎట్టకేలకు ఏడీఏల బదిలీలు కొలిక్కి వచ్చాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రానికి జోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, శైలకుమారీలను నియమించారు. తాజాగా అశోక్‌వర్ధన్‌రెడ్డిని భూసార పరీక్ష కేంద్రం ఏడీఏగా నియమించారు. శైలకుమారికి పోస్టింగ్ ఇవ్వలేదు. మొదట పలమనేరులో ఏడీఏగా పనిచేస్తున్న అన్నపూర్ణను ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏగా నియమించారు. తాజా ఉత్తర్వుల్లో ఈమె పేరు లేదు. కర్నూలు డీఆర్‌సీలో ఏడీఏగా పనిచేస్తున్న గిరీష్ ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. అయినప్పటికీ నందికొట్కూరు ఏడీఏగా బదిలీ చేశారు. అయితే ఈ పోస్టులో ఎవ్వరినీ నియమించలేదు. ఈ పోస్టు కోసం అన్నపూర్ణ కూటమి పార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఏడీఏల బదిలీల్లో ఎలాంటి మార్పులు లేవు.


### ఆషాఢమాసం ఎఫెక్ట్

మహానంది: ఆషాఢమాసం ప్రారంభం కావడంతో మహానందికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వేసవిసెలవులతో పాటు శుభముహూర్తాలు ఉన్నందున గత నెలరోజులుగా నిత్యం వేలాది మంది భక్తులతో కళకళలాడిన మహానందీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం భక్తులు లేక వెలవెలబోతూ కనిపించింది.

# రైతుల నెత్తిన ప్రీమియం పిడుగు!

**ఉచిత పంటల బీమాకు మంగళం**

- ఈ ఖరీఫ్ నుంచి ప్రీమియం చెల్లిస్తేనే వర్తింపు
- కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 13 పంటలకు బీమా
- రెండు జిల్లాల్లో వరికి గ్రామం యూనిట్‌గా అమలు
- ఉమ్మడి జిల్లాలో పత్తి 2,53,236 హెక్టార్లలో సాగు
- రైతులపై రూ.126.61 కోట్ల భారం



కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2024–25 రబీ నుంచి ఉచిత పంటల బీమాకు మంగళం పిలికింది. సూపర్–6లో భాగంగా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలో ఆ ఊసే మరిచారు. తాజాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా ఇప్పటికీ కాలయాపన చేస్తున్నారు. తాజాగా ఉచిత పంటల బీమాను రద్దు చేసి ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపును అమలు చేస్తున్నారు. 2024 ఖరీఫ్ సీజన్ వరకు ఉచిత పంటల బీమాను అమలైనా.. అధిక వర్షాలు, వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నప్పటికీ ఒక్క రూపాయి పరిహారం అందివ్వని పరిస్థితి. 2024–25 రబీ నుంచి ప్రీమియం చెలించడం ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాను అమలు చేసింది. అయితే పరిహారం వస్తుందో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా అమలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు విధానం అమలు చేస్తుండటం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**పత్తికి బీమా చేసుకోవాలంటే హెక్టారుకు రూ.5వేలు**

కర్నూలు జిల్లాలో పత్తి 2,34,409 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 18,827 హెక్టార్లలో సాగవుతుంది. రూ.లక్షకు బీమా చేస్తారు. వాతావరణ ఆధారిత బీమా కింద 5 శాతం ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. అంటే హెక్టారుకు రూ.5వేలు చెల్లించాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో పత్తి 2,53,236 హెక్టార్లలో సాగు చేస్తారు. మొత్తం పత్తికి బీమా చేయాలంటే ప్రీమియం రూపంలో రూ.126.61 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాతావరణ ఆధారిత బీమా కింద ప్రీమియం జూలై 15లోపు, ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద జూలై 31లోపు ప్రీమియం చెల్లించాలి. వరికి మాత్రం ఆగస్టు 15 వరకు గడువు ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను కర్నూలు జిల్లాలో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, నంద్యాల జిల్లాలో ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, వాతావరణ ఆధారిత బీమాను కర్నూలు జిల్లాలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, నంద్యాల జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తున్నాయి.

**నంద్యాల జిల్లా రైతులపైనే అధిక భారం**

➡ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతు వాటా ప్రీమియం మొత్తాన్ని తగ్గించడం కాస్త ఊరట కలిగించే విషయం.

➡ కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద ఎండుమిర్చికి 0.40 శాతం ఉండగా.. మిగిలిన 8 పంటలకు 0.20 శాతం ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

➡ నంద్యాల జిల్లాలో రైతుల వాటా ప్రీమియం ఎక్కువగా ఉంటోంది.

➡ వరి, మొక్కజొన్న, కంది పంటలకు 2 శాతం, మినుము, జొన్న, సజ్జ, కొర్ర, ఆముదం, ఉల్లి పంటలకు 1 శాతం, ఎండుమిర్చికి 3.20 శాతం, పత్తికి 4 శాతం ప్రకారం ప్రీమియం చెల్లించాలి.

➡ నంద్యాల జిల్లాలో అరటికి వాతావరణ ఆధారిత బీమా ఉంది. బీమా రూ.1,37,500 మొత్తానికి 5 శాతం ప్రకారం రూ.6,875 ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

➡ ప్రధానమంత్రి ఫసల్ బీమా(దిగుబడి ఆధారిత బీమా) కింద గ్రామం యూనిట్‌గా వరి, మండలం యూనిట్‌గా మిగిలిన పంటలు నోటిఫై అయ్యాయి.

**కర్నూలు జిల్లాలో బీమా చేయించుకోవాలంటే ప్రీమియం ఇలా..**

| పంట | బీమా యూనిట్ | బీమా చేసే మొత్తం (హెక్టారుకు రూ॥ల్లో) | రైతు వాటా (హెక్టారుకు రూ॥ల్లో) |
|---|---|---|---|
| పత్తి | మండలం యూనిట్ | 1,00,000 | 5,000(5 శాతం) |
| వేరుశనగ | మండలం యూనిట్ | 70,000 | 1,400(2 శాతం) |
| వరి | గ్రామం యూనిట్ | 1,00,000 | 200(0.20శాతం) |
| మొక్కజొన్న | మండలం యూనిట్ | 82,500 | 165(0.20శాతం) |
| కంది | మండలం యూనిట్ | 55,000 | 110(0.20శాతం) |
| ఎండుమిరప | మండలం యూనిట్ | 2,25,000 | 900(0.40శాతం) |
| జొన్న | మండలం యూనిట్ | 47,500 | 95(0.20శాతం) |
| ఆముదం | మండలం యూనిట్ | 45,000 | 90(0.20శాతం) |
| కొర్ర | జిల్లా యూనిట్ | 40,000 | 80(0.20 శాతం) |
| సజ్జ | జిల్లా యూనిట్ | 40,000 | 80(0.20 శాతం) |
| ఉల్లి | జిల్లా యూనిట్ | 1,12,500 | 225(0.20 శాతం) |

**వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.1065.61 కోట్ల పరిహారం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది అంటే 2019–20లో కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిఫై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది. 2020–21 నుంచి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు పంటల బీమా సదుపాయం కల్పించే ఏర్పాటు చేయడం విశేషం. 2019–20 నుంచి 2022–23 వరకు ఉచిత పంటల బీమా కింద రైతన్నలకు చెల్లించిన పరిహారం రూ.1065.61 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయింది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే బీమా పరిహారం విడుదల చేయడం వల్ల రైతులకు ఊరట లభించింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా దేశానికే ఆదర్శం కావడం విశేషం.

**ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద నోటిఫై పంటలు: 9**

(వరి, జొన్న, ఎండుమిర్చి, మొక్కజొన్న, ఆముదం, కంది, ఉల్లి, కొర్ర, సజ్జ)

**వాతావరణ ఆధారిత బీమా కింద నోటిఫై పంటలు: 2**

(పత్తి, వేరుశనగ)

నంద్యాల జిల్లాకు అదనంగా మినుము, అరటికి వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుంది

### 15లోపు పంటల బీమా చెల్లించండి

కర్నూలు(సెంట్రల్): 2025–26 సంవత్సరానికి సంబంధించి పంటల బీమా ప్రీమియం జూలై 15లోపు చెల్లించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా రైతులకు సూచించారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు. పత్తి, వేరుశనగ పంటలను మండలం యూనిట్‌గా ఖరీఫ్ పంటకాలనికి నోటిఫై చేయగా, జూలై 15లోపు బీమాను చెల్లించాల్సి ఉందన్నారు. పత్తికి హెక్టారుకు రూ.5వేలు, వేరుశనగకు హెక్టారుకు రూ.1,400 చెల్లించాలని సూచించారు. కాగా, పంటలు నష్టపోతే పత్తికి సంబంధించి హెక్టారుకు రూ.లక్ష, వేరుశనగకు రూ.70 వేల వరకు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, చిత్రంలో డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఎంపీ నాగరాజు, మేయర్ బీవై రామయ్య తదితరులు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): డ్రగ్స్ బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గంజాయి, గుట్కా, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించినట్లు చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు రాజ్ విహార్‌నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

**హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తాం**

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీ సమీపంలో హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఈగల్ టీంలను విద్యార్థులతో ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ అలవాటు పడకుండా వాటితో కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు వివరించాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్ట నిఘా ఉన్నట్లు డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పారు. ఇంట్లో ఒక్కరూ డ్రగ్స్ తీసుకుంటే ఆ కుటుంబం మొత్తం నాశనం అవుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా వేసి ఉంచాలన్నారు. అనంతర డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేర్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, స్ఫూర్తి రిహాబిలిటేషన్ సంస్థ ప్రతినిధి శివశంకర్, సైకియాట్రిస్టు డాక్టర్ చైతన్య కుమార్ పాల్గొన్నారు.

### కుడా కార్యదర్శిగా పి. బాలక్రిష్ణా రెడ్డి

కర్నూలు(టౌన్): కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యదర్శిగా పి.బాలక్రిష్ణా రెడ్డి నియమితులయ్యారు. ఈయన ఆదోని డివిజన్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్నారు. ఏడాది పాటు డిప్యూటేషన్‌పై కుడా కార్యదర్శిగా బదిలీ చేస్తు గురువారం సాయంత్రం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ జీవో జారీ చేశారు.

### 30వరకు వృద్ధులు, వికలాంగులకు రేషన్ పంపిణీ

కర్నూలు(సెంట్రల్): జూన్ 30వ తేదీ వరకు 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటికే వెళ్లి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ రాజారఘువీర్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక ప్రతినెలా 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, వికలాంగులకు ముందుగానే వారి ఇంటికే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులను పంపిణీ చేస్తారన్నారు. అందులో భాగంగా జూన్ నెలకు సంబంధించి గురువారం జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులకు రేషన్‌పంపిణీ కార్యక్రమం మొదలైందన్నారు. కార్యక్రమాన్ని పత్తికొండలో జేసీ డాక్టర్ బి.నవ్య ప్రారంభించినట్లు చెప్పారు. కాగా, జిల్లాలో 65 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు కలసి 44,961 మంది ఉన్నారని, అందులో మొదటి రోజే 12వేల మందికి సరుకుల పంపిణీ పూర్తయిందన్నారు.

## ఐజీ గుర్తింపుతో అంతర్జాతీయ మార్కెటింగ్



బెడ్‌షీట్‌ను పరిశీలిస్తున్న రెసెల్యూట్ బి2బి సంస్థ ప్రతినిధి, చేనేత జౌళిశాఖ డీఓ, అధికారులు



చేనేతలు నేసిన టవల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

- టవళ్లు, బెడ్‌షీట్లను పరిశీలించిన రెసెల్యూట్ బి2బి సంస్థ ప్రతినిధి

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న టవళ్లు, బెడ్‌షీట్లకు భౌగోళిక గుర్తింపు(ఐజీ) వస్తే అంతర్జాతీయంగా మార్కెటింగ్ పెరగుతుందని రెసెల్యూట్ బి2బి సంస్థ లీగల్ కౌన్సిల్ ప్రతినిధి శ్రీవత్సవ తెలిపారు. ఎమ్మిగనూరులోని వైడబ్ల్యూసీఎస్ కార్యాలయంలో చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన బర్డ్ ఐ టవళ్లు, జిందగీ బెడ్‌షీట్‌లను చేనేత జౌళిశాఖ డీఓ నరసింహారెడ్డి, స్థానిక సంఘ కార్యదర్శి, ఏడీ అప్పాజిలతో కలిసి ఆయన పరిశీలించారు. చేనేత కార్మికులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పద్మశ్రీ మాచాని సోమప్ప ప్రారంభించిన సొసైటీ ద్వారా ఉత్పత్తి అయిన టవళ్లు, బెడ్‌షీట్లకు భౌగోళిక గుర్తింపునకు తాము పరిశీలించామన్నారు. సేకరించిన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అక్కడ వారు పరిశీలించిన తరువాత ఐజీ గుర్తింపు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఐజీ గుర్తింపు వస్తే ఎమ్మిగనూరులో మాత్రమే ఆయా ఉత్పత్తులు చేయాల్సి ఉంటుందన్నారు. తద్వార ఉత్పత్తుల విక్రయాల మార్కెటింగ్ పెరగడంతో పాటు ఆయా ఉత్పత్తుల ధరలు కూడా 15 నుంచి 30 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ఇక్కడి టవళ్లు, బెడ్‌షీట్లకు జీఐ గుర్తింపు వస్తే ఆయా ఉత్పత్తులను వేరొకరు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉండబోదన్నారు.

**ఎమ్మిగనూరు చేనేతకు మంచి పేరు**

ఎమ్మిగనూరు ప్రాంతంలో పత్తి సాగు ఎక్కువగా ఉండటంతో పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో వైడబ్ల్యూసీఎస్‌ను ప్రారంభించారని సొసైటీ కార్యదర్శి, ఏడీ అప్పాజి తెలిపారు. ఎన్‌హెచ్‌డీసీతో నాణ్యమైన ముడిసరుకు తీసుకొని ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మిగనూరు చేనేత ఉత్పత్తులకు మంచి పేరుందన్నారు. సొసైటీ డిజైనర్ రవికుమార్, వైడబ్ల్యూసీఎస్ సిబ్బంది, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఇదేమి 'తీరు'వా?

- సాగునీరు అందకున్నా పన్ను చెల్లించాలా?
- ఆందోళన చెందుతున్న రైతులు



ఆలూరు తహసీల్దార్ కార్యాలయం

ఆలూరు: ''ఆయకట్టు భూములకు సాగునీరు అందకున్నా మాకు సంబంధం లేదు. మీరు పెండింగ్‌లో ఉన్న నీటి తీరువా బకాయిలు చెల్లించాలి. ఈకేవైసీ చేసుకోవాలి. లేదంటే అన్నదాత సుఖీభవ పథకం అమలు కాదు'' అంటూ రైతులపై వీఆర్వోలు ఒత్తిళ్లు తెస్తున్నారు. తుంగభద్ర ఎగువ, దిగువ కాలువ కింద పొలాలు ఉన్న రైతులు నీటితీరువా వెంటనే చెల్లించాలని మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. హాలహర్వి మండలం ఎం.కె.పల్లి, శ్రీధర్‌హాళ్, బాపురం, కొక్కెరచేడు, చింతకుంట, చిప్పగిరి మండలం బెల్డోణ, రామదుర్గం, ఖాజీపురం, తిమ్మాపురం, ఆలూరు మండలం హత్తిబెళగళ్ గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అలాగే ఇంగళదహాళ్, ఏ.గోనెహాళ్, వందవాగిలి, గజ్జహళ్లి, హొళగుంద, కోకిలతోట గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి పెండింగ్ బకాయిలను చెల్లించాలంటున్నారు. వీఆర్వోలతోపాటు టీడీపీ నాయకులు కూడా వెళ్తున్నారు. రైతులపై ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. ఎంకేపల్లి గ్రామంలో మైక్ ద్వారా నీటి తీరువా చెల్లించాలని ప్రచారం చేయడం బహిర్గతమైంది.

**ఏడాదికి ఎకరాకు రూ. 120**

ఆలూరు నియోజకవర్గంలో చిప్పగిరి మండలం కమ్మకొట్టాల గ్రామాల నుంచి హెచ్చెల్సీ ప్రారంభమై ఆలూరు మండలం హత్తిబెళగళ్ గ్రామం వరకు సాగుతుంది. ఈకాలువ పరిధిలో 19 డీపీల కింద 14,555 ఎకరాలకు కాను 250 క్యూసెక్కుల సాగునీరు విడుదల కావాల్సి ఉంది. అయితే కాలువ పటిష్టతను కోల్పోవడంతో సాగునీరు అంతా వృథా అవుతోంది. కాలువ కింద కేవలం 4వేల నుంచి 6 వేల ఎకరాలకు సాగునీరు మించి అందటంలేని రైతులు చెబుతున్నారు. నీరు అందినా, అందకున్నా ఏడాది ఎకరాకు రూ.120 ప్రకారం చెల్లించాలని కొందరు వీఆర్వోలు టీడీపీ నాయకులతో కలసి రైతులపై ఒత్తిడి చేస్తున్నారు. ఎల్లెల్సీ కింద ఆలూరు నియోజకవర్గంలో చింతకుంట, బాపురం, హొళగుంద మూడు సెక్షన్లు ఉన్నాయి. చివరి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. అయినా నీటి పన్ను చెల్లించాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

> **బకాయిలు వసూలు చేయమన్నాం**
>
> కాలువల ద్వారా సాగునీటిని పంటల సాగుకు వాడుకుంటున్న రైతుల నుంచి బకాయి పడ్డ పన్నులను వసూలు చేయాలని వీఆర్వోలకు తెలిపాం. అయితే మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అన్నదాత సుఖీభవ పథకాలు వంటిపై ప్రచారం చేస్తున్న విషయంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సాగునీరు సక్రమంగా రాకున్నా పన్నులు ఎలా చెల్లించాలని కొందరు రైతులు తన దృష్టికి తెచ్చారు.
>
> – ఎజాజ్ అహ్మద్, చిప్పగిరి తహసీల్దార్

### కమిటేషన్ రికవరీ సుప్రీం తీర్పునకు వ్యతిరేకం



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. గురువారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తీసుకున్న కమిటేషన్ రికవరీ 11 సంవత్సరాల 3 నెలల్లో పూర్తవుతుందన్నారు. అందువల్ల ఇక రికవరీ చేయరాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఇందుకు అనుగుణంగా ఆరు నెలల పాటు కమిటేషన్ రికవరీ నిలిపేశారన్నారు. అయితే గత నెల నుంచి మళ్లీ రికవరీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఒక్కో విశ్రాంత ఉద్యోగి పెన్షన్‌లో రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు ప్రభుత్వం మళ్లీ రికవరీ మొదలు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని.. 11 ఏళ్ల 3 నెలలు కమిటేషన్ రికవరీ చేసి ఉంటే అలాంటి వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జనరల్ సెక్రటరీ జయచంద్రారెడ్డి, ఇతర నాయకులు గోవిందరాజులు, రామచంద్రరావు, జేసీ నాథ్, ఇనయతుల్లా, విజయకుమార్‌రెడ్డి, సూర్యనారాయణ, పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన పుల్లయ్య

గోస్పాడు: కానాలపల్లె గ్రామానికి చెందిన పుల్లయ్య గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నా ఇతను పలు చోట్ల వైద్యం పొందినా నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ మేరకు ఇంటి ముందు అలంకరణకు ఉపయోగించే రసాయన పౌడర్‌ను నీళ్లలో కలిపి తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

### కారు ఢీకొని జింక మృతి


మృతి చెందిన జింక

మంత్రాలయం రూరల్: కల్లుదేవకుంట– మంత్రాలయం మధ్యలో 167వ జాతీయ రహదారిలో కారు ఢీకొని జింక మృతి చెందింది. కల్లుదేవకుంట గ్రామ సమీపంలో పొలంలో నుంచి జింక రోడ్డు దాటుతుండగా గురువారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫారెస్టు అధికారిణి అనురాధ ఘటన స్థలానికి వచ్చి మృతి చెందిన జింకను తుంగభద్ర రిజర్వ్ ఫారెస్టుకి తీసుకెళ్లారు. వెటర్నరీ డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

### ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి


మృతిచెందిన షేక్ ఇస్మాయిల్

జూపాడుబంగ్లా: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు నుంచి గూడెం శ్రీనివాసులు అనే ఆటో డ్రైవర్ జూపాడుబంగ్లాకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మండ్లెం గ్రామం వద్ద భవన నిర్మాణ కార్మికులు షేక్ ఇస్మాయిల్(50) అబ్దుల్లా, రఫీ ఎక్కారు. తంగడంచ చెక్‌పోస్ట్ మలుపు వద్దకు రాగానే వేగాన్ని డ్రైవర్ శ్రీనివాసులు అదుపు చేయలేకపోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండ్లెం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోడ్రైవర్ శ్రీనివాసులుకు రెండు కాళ్లు విరిగాయి. అబ్దుల్లా, రఫీకు తీవ్ర గాయాల పాలయ్యారు. విషయం తెలు సుకున్న ఎస్‌ఐ ప్రమాద స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### 29న స్వేచ్ఛ సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు (కల్చరల్): టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 29న సాయంత్రం 7 గంటలకు సి.క్యాంప్ కళాక్షేత్రంలో స్వేచ్ఛ సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ నాటక దర్శకుడు బీఎం రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సాంఘిక నాటక ప్రదర్శన ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా పరిషత్తు నాటక పోటీల్లో సంచలనం సృష్టించిందని పేర్కొన్నారు. ఇందులో బలగం సినిమా ఫేమ్ సురభి లలిత ఒక ముఖ్య పాత్రను పోషిస్తుందని తెలిపారు. అలాగే భాస్కర్‌యాదవ్, కేవీ రమణ, చల్లా నవీన్‌కుమార్ చౌదరిలచే శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకంలోని పడక శీను సన్నివేశం ప్రదర్శన ఉంటుందన్నారు.

# నెల వంక దర్శనం.. మొహర్రం ప్రారంభం

- ఊరూరా కొలువుదీరనున్న పీర్లు


చాగలమర్రిలో ముస్తాబైన లాల్‌స్వామి మకానం


పీర్ల పండుగకు గుండం తవ్వుతున్న దృశ్యం

చాగలమర్రి: ఇస్లాం క్యాలెండర్ ప్రకారం గురువారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనంతో నూతన సంవత్సరం ప్రారంభమైంది. మొదటి నెల మొహర్రం కావడంతో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం జ్ఞాపకార్థం పది రోజుల పాటు సంతాప కార్యక్రమాలు జరుపుకుంటారు. మొహర్రం నెలలోనే ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ రసూలల్లా సొల్లేల్లాహు అలైహి వసల్లం మనువళ్లు ఇస్లాం మత వ్యాప్తి కోసం కర్బాలా మైదానంలో (సాదీలో) 10 రోజుల పాటు యుద్ధం చేశారు. ఈ యుద్ధంలో వారి వంశానికి చెందిన 72 మంది అశువులు బాసి వీరమరణం పొందారు. వారిని స్మరించటానికి ఏటా మొహర్రం నెలలో పది రోజుల పాటు కార్యక్రమాలు చేస్తారు. ఈ మేరకు ఊరూరా పీర్ల చావిడ్లలో పీర్లను కొలువుదీర్చి పూజలు చేయనున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి పీర్ల దేవుళ్లను భద్రపరిచిన పెట్టెలను సంప్రదాయ మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి చావిడ్లకు చేర్చారు.

#### చాగలమర్రిలో మత సామరస్యానికి ప్రతీకగా..

చాగలమర్రిలో నిర్వహించే పండగల్లో పీర్ల పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొనడంతో మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. గ్రామంలోని లాల్ స్వామి, హజ్రత్ ఇమాం హుస్సేన్, హజ్రత్ ఇమాం హుసేన్, హజ్రత్ ఇమామే ఖాశీం, హజ్రత్ హురేష హీద్, హజ్రత్ ఆలీ అక్బర్ (గుర్రం మీద పీరు)లను కొలువు దీర్చి 10 రోజుల పాటు పూజలు చేయనున్నారు. భక్తులు ప్రత్యేక చదివింపులు, ముడుపులు చెల్లించనున్నారు. వెండి గొడుగులు, ఉయ్యాలలు, విలువైన చాదర్‌లు సమర్పించనున్నారు. గ్రామానికి చెందిన వారు వృత్తి రీత్యా సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన మొహర్రం వేడుకలకు తప్పకుండా హాజరవుతారు. ప్రతి ఇల్లు బంధువులు, స్నేహితులతో కళకళలాడనున్నాయి.

#### కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీర్లు


హజరత్ అబ్బాస్ పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మొహర్రం సందర్భంగా పట్టణంలోని ఆస్థానంలో హజరత్ అబ్బాస్ పీర్లు కొలువుదీరాయి. బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలీఖాన్ ఆధ్వర్యంలో నవాబు ఇంటి నుంచి భక్తి గీతాలు ఆలపిస్తూ ఆస్థానం వద్దకు పీర్లను తీసుకొచ్చారు. పీర్లను ముస్తాబు చేసి, పూలదట్టీలు సమర్పించారు. అనంతరం షియా మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహర్రం వేడుకల్లో భాగంగా జూలై 3వ తేదీన చిన్న సరిగెత్తు, 4న మధ్య సరిగెత్తు, 6న జుర్రేరువాగులో పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి హజరత్ అబ్బాస్ పీర్లను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం వేడుకలు ముంబాయి తరువాత బనగానపల్లె పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో హిందూ, ముస్లిం సోదరులు ఐకమత్యంగా నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకలకు మొట్టమొదటి సారిగా ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మొహర్రం సందర్భంగా ఆస్థానాన్ని ప్రత్యేక విద్యుత్‌దీపాలంకరణ చేశారు. బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కౌలు రైతులకు విరివిగా రుణాలు

- వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.17.402.86 కోట్లు
- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా


వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గతేడాది హౌసింగ్, విద్యుత్ లోన్లను ఇవ్వడంలో బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ ఏడాది రుణాల మంజూరులో మరింత చొరవ చూపాలన్నారు. గతేడాది నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలను అందజేశారని, అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

**రెన్యువల్ ఎనర్జీ కేంద్రంగా కర్నూలు**

రానున్నకాలంలో కర్నూలు జిల్లా పునరుత్పాదకశక్తి(రెన్యువల్ ఎనర్జీ)కేంద్రంగా మారనుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓర్వకల్‌లో 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, గ్రీన్‌కో ద్వారా 1,680 మెగావాట్లా సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటితో ఆలూరు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల్లో పలుసోలార్, విండ్ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతుండడంతో రుణాలు ఇవ్వాలని సూచించారు.

**డ్రోన్‌ల మంజూరు వేగవంతంచేయాలి**

- ఎస్‌ఎల్‌బీసీ నిబంధనల మేరకు డ్రోన్‌ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.
- పీఎం సూర్య ఘర్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే రుణాలు ఇవ్వాలన్నారు.
- స్టాండ్ అప్ ఇండియా, పీఎం విశ్వకర్మయోజన రుణాల లక్ష్యాలను సాధించాలని సూచించారు.

**వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.17,402.86 కోట్లు**

2025–26 వార్షికరుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ఏడాది లక్ష్యంరూ.17402.86 కోట్లు అని, ఇది గత సంవత్సరంతో పోల్చుకుంటే 15.49 శాతం ఎక్కువగా ఉందని తెలిపారు.

- మొత్తం వ్యవసాయరుణాలు రూ.6162.06 కోట్లు కాగా, అందులో ఖరీఫ్ వ్యవసాయ రుణాలు రూ.3635.62 కోట్లు, రబీ వ్యవసాయ రుణాలురూ.2526.44కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలుకు రూ,39.24 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలపాలకు రూ.560.38కోట్లు కేటాయించినట్లు చెప్పారు.మొత్తంగా వ్యవసాయరంగానికి రుణ లక్ష్యంరూ.8964.22 కోట్లు అని, ఇది మొత్తం రుణ లక్ష్యంలో 51.51 శాతంగా ఉన్నట్లు చెప్పారు.
- మైక్రో, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ.3570.63 కోట్లు, విద్యారుణాలు కోసం రూ.80.26 కోట్లు, హౌసింగ్ రుణాలు రూ.200.81 కోట్లు,పునరుత్పాదక శక్తి రూ.94.33కోట్లు, ఇతర రంగాల రుణాల క్ష్యం రూ.13601.72 కోట్ల రుణ లక్ష్యాన్ని కేటాయించినట్లు వివరించారు.
- కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, మునిసిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మెప్మా పీడీ నాగశివలీల, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- మత్స్యశాఖకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు.
- రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ శిక్షణ కేంద్రం ద్వారా 35 మంది 4 వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

**పేదల కోసం 'సోషల్' నిధి**

పేదల కోసం జిల్లాలోఉన్న అన్ని బ్యాంకులు కలసి కొంత మొత్తంతో సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ)నిధిని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అన్ని బ్యాంకుల నుంచి సీఎస్ఆర్ కింద కొంత మొత్తాన్ని జమ చేసి లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలన్నారు. ఆ మొత్తం మీద వచ్చేవడ్డీతో నిజంగా డబ్బు అవసరం ఉన్నటువంటి రైతులు, పేదలకు సాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా చర్యలు ఉండాలని ఎల్‌డీఎం రామచంద్రరావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా వెంకటేశ్వర్ రెడ్డి



ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా మెట్టు వెంకటేశ్వర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడిగా పని చేసిన వెంకటేశ్వర్ రెడ్డికి రైతు సమస్యలపై మంచి అవగాహన ఉంది. దీన్ని గుర్తించిన అధిష్టానం రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పై మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

### బాల్య మిత్రునికి ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న మిత్రులు

మద్దికెర: బాల్య మిత్రుడు కుంకునూరు వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మద్దికెరకు వెళ్లి 2003–04 బ్యాచ్ విద్యార్థులు గురువారం రూ.42,650 ఆర్థికసాయం అందజేశారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం ఇచ్చారు. మిత్రుడు ఆపదలో ఉంటే ఆదుకోవడం మానవత్వం అని రాజు, కృష్ణారెడ్డి, నల్లగుట్ల తెలిపారు.

### 6న బ్రాహ్మణ విద్యార్థులకు సన్మానం


మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

కర్నూలు(అర్బన్): పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులను జూలై 6వ తేదీన సన్మానించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. కర్నూలులోని కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు నగరంతో పాటు కల్లూరు మండలంలోని బ్రాహ్మణ విద్యార్థులను సన్మానిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు తమ మార్కుల జాబితాల జిరాక్స్ కాపీలను జతచేసి జూలై 3వ తేదిలోగా స్థానిక సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మేనేజర్‌కు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9393605937, 9440224878 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పద్మావతి

కర్నూలు(హాస్పిటల్): గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీగా ప్రిన్సిపాల్‌గా ఆర్.పద్మావతి నియమితులయ్యారు. గుంటూరులో గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమె కర్నూలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం కర్నూలులో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎన్.మంజుల విధులు నిర్వహిస్తున్నారు.

### మసీదుపురంలో వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతి చెందిన రామసుబ్బారెడ్డి

మహానంది: మసీదుపురం గ్రామానికి ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన మునగాల రామసుబ్బారెడ్డి(53)కి అప్పుడప్పుడు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఒంటెద్దు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వడ్డె సంపంగి నారాయణ, పెరుమాళ్ల చెన్నరాయుడు, నులకచందనం రాముడులతో రామసుబ్బారెడ్డి కలిసి ఈశ్వర్‌రెడ్డి బావి వద్ద బుధవారం రాత్రి మద్యం సేవించారు. రాత్రి 10.30 గంటలకు భర్త ఇంటికి రాకపోవడంతో భార్య తులశమ్మ ఫోన్ చేస్తే మొబైల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అయితే రామసుబ్బారెడ్డి గురువారం ఉదయం బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు బావి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా అతని శరీరమంతా గాయాలున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతిని భార్య తులశమ్మ నలుగురిపై అనుమానం వ్యక్తం చేయడంతో, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆదోని ఎమ్మెల్యేకు చుక్కెదురు


ఇంజనీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించడానికి వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి చుక్కెదురైయింది. పనులకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇవ్వాలని ఏడీఈని కోరగా డీఆర్ఎం అనుమతులు కావాలని చెప్పాడు. దీంతో ఎమ్మెల్యే ఒక్కసారిగా అవాక్కయ్యాడు. రూ. 9 కోట్లతో పనులు జరుగుతున్నప్పుడు కనీసం ప్రణాళిక నమూనాలు కూడా లేవా అంటూ ప్రశ్నించారు. అధికారులు స్పందించి నమూనాలు అయితే ఉన్నాయని చూపించారు. ఒకసారి లేవు అంటారు మరి చూపిస్తున్నారు అంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్లలో నాణ్యతతో పనులు చేపట్టాలని అధికారులు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన నాగేంద్ర రెడ్డి (ఫైల్)

అవుకు: అతివేగానికి ఓ నిండు ప్రాణం బలైంది. అవుకు – బనగానపల్లె రహదారిలో గురువారం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామానికి చెందిన కాటంరెడ్డి నాగేంద్ర రెడ్డి(55) అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సొంత పనుల నిమిత్తం వచ్చాడు. పని పూర్తయిన అనంతరం స్వగ్రామానికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో కోనాపురం మెట్ట సమీపంలోకి రాగానే బనగానపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో నాగేంద్రరెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అతి వేగంతో బైక్ నుజ్జునుజ్జు అయింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న వ్యక్తి క్షేమంగా బయటపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు సీహెచ్‌సీకి తరలించారు. అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. మృతుడు నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన అవుకు సీహెచ్‌సీకి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి కూడా ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మత్తు పదార్థాలతో జీవితం నాశనం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: మత్తు పదార్థాలతో యువత జీవితం నాశనం చేసుకోవద్దని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు పిలుపునిచ్చారు. గురువారం వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ వర్సిటీ క్యాంపస్‌లో డ్రగ్స్‌కు స్థానం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. యువత బంగారు భవితకు బాటలు వేసుకునే దిశగా ఆలోచన చేయాలన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ బాధ్యత గలిగిన పౌరులుగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి బారిన పడిన వారికి పునరావాస కేంద్రాల ద్వారా సరైన చికిత్స అందేలా చూడాలన్నారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడు, సీడీసీ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్స్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వీసీ ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీని ఆర్‌యూ వద్ద వీసీ జెండా ఊపి ప్రారంభించారు. రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### చిట్టడవి కాదు ఆయకట్టు భూమి



ఇది తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలోని చెరువు కింద ఉన్న ఆయకట్టు భూమి. చెరువు నీరు అందక ముళ్ల కంపలతో చిట్టడవిని తలపిస్తోంది. జొన్నగిరి చెరువు కింద 160 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. వరి పంటతో కళకళలాతూ ఉండేది. సరైన వర్షాలు లేక చెరువు నిండకపోవడంతో నీరు రాక ఆయకట్టు భూమిలో ముళ్ల కంపలు దట్టంగా పెరిగాయి. ముళ్ల కంపలు తొలగించి వరిపంట సాగు చేసే స్థోమత రైతులకు లేదు. హంద్రీ- నీవా నీటిని చెరువుకు ఇస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చినా ఇంత వరకు సాధ్యం కాలేదు. చెరువులో నీళ్లు లేకపోతే ఏటా వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటోంది. ఆకట్టు సాగు మాట అటుంచితే కనీసం తాగునీటి ఎద్దడి నివారణకైనా ప్రభుత్వం స్పందించాలని జొన్నగిరి గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. – తుగ్గలి

### మొబైల్ 'మాల్'


తల్లి ఈరమ్మతో కుమారుడు నాగేంద్ర


ఆటోలో దుకాణం

ఈ చిత్రం చూస్తే ఏదో దుకాణం వద్ద ఇద్దరు నిల్చున్నట్లుగా అనిపిస్తోంది కదూ.. కాస్తా పరిశీలనగా చూస్తే అది మొబైల్'మాల్' అని అర్థమవుతుంది. జీవన పోరాటంలో ఒక్కొక్కరిది ఒక్కో మార్గం. చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి నాగేంద్ర కూడా ఉపాధి కోసం వినూత్నంగా ఆలోచించాడు. బేతంచెర్ల పట్టణం హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన ఇతను ఆటోను మొబైల్‌మాల్‌గా మార్చేశాడు. ప్లాస్టిక్ వస్తువులు, గాజులు, ఫ్యాన్సీ ఐటమ్స్, చట్నీలను ఊరూరా తిరుగుతూ విక్రయిస్తున్నాడు. ఇతనికి అతని తల్లి ఈరమ్మ కూడా తోడు నిలిచింది. దాదాపు ఆరేళ్లుగా గ్రామీణ ప్రాంతాలు తిరుగుతూ వ్యాపారం చేస్తున్నారు. దూరం నుంచి చూస్తే దుకాణం ఉందా అన్నట్లుగా ఉంటుంది. దగ్గరకు వెళ్లి చూస్తే తప్ప ఆటో కనిపించదు. ఖర్చులు పోను వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని నాగేంద్ర చెబుతున్నాడు. – బేతంచెర్ల

### అవ్వకు 'వంద'నం


కుటుంబసభ్యులతో హనుమంతమ్మ


95 ఏళ్ల వయసులో ముగ్గులు వేస్తున్న హనుమంతమ్మ (ఫైల్)

ప్రస్తుత కాలంలో 75 సంవత్సరాలు జీవించడమే కష్టం. అయితే మద్దికెర మండలం బురుజుల గ్రామానికి చెందిన అవ్వ హనుమంతమ్మ అనారోగ్య సమస్యలు లేకుండా వందేళ్లకు పైగా జీవనం సాగిస్తోంది. దీంతో కుటుంబసభ్యులు గురువారం అవ్వను సన్మానించారు. హనుమంతమ్మకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొత్తం 89 మంది మనువళ్లు, మనవరాళ్లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతమ్మ చిన్నతనంలో 1926లో పెరవలి గ్రామానికి మహాత్మాగాంధీ వచ్చినప్పుడు ఇంట్లో పెద్ద వాళ్లతో కలిసి వెళ్లి చూశారని, ఈ విషయాన్ని తమకు చెప్పేవారని చిన్న కుమారుడు రామాంజనేయులు తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏ ఆహారం తినాలో, ఎలాంటి పనులు చేయాలో తన తల్లికి బాగా తెలుసని చెప్పారు. – మద్దికెర